# కోపాన్ని జయించిన సౌశీల్యం

వానలు వెనక పట్టాయి. ఆకాశం నిర్మలంగా ఉంది. చెట్టు చేమలు పచ్చపచ్చగా ఉన్నాయి. అక్కడక్కడ వాన నీరు గుంటల్లో నిలిచివుంది.

ఒక చెట్టుమీద రెండు కోతులు కిచకిచ లాడుతున్నాయి; పోట్లాడుకుంటున్నాయి కాబోలు. ఆ చెట్టుకింద ఒక ముసలికోతికి పడుచుకోతి పేలు చూస్తోంది. ఎటు చూచినా కోతులే – పడుచువీ ముసలివీ, చిన్నవీ పెద్దవీ. అది ఋశ్యమూక పర్వతం!

ఒక బండమీద రెండు కోతులు. ప్రేయసీ ప్రియులు. సంతోషంలో మైమరచి వున్నాయి.

ఆ బండకు దగ్గరలోనే ఉన్న పర్ణశాల ఆవరణలో ఒక తిన్నెమీద ఆసీనుడై రాముడు మార్చి మార్చి చూస్తున్నాడు తెల్లని ఆకాశాన్నీ పచ్చని చెట్టు చేమల్నీ. కోతుల కిచకిచలూ పక్షుల కలకలారావం ఆ పరిసరాలకి సందడి కలిగిస్తున్నాయి. దూరాన మదగజ ఘీంకారాలు వినవస్తున్నాయి.

ఉన్నట్టుండి రాముడు 'లక్ష్మణా!' అన్నాడు సంతోషం కొద్దీ.

బదులు వినిపించలేదు.

'తమ్ముడూ, తమ్ముడూ...'

బదులు రాలేదు.

నా మతిమరుపు బంగారం కాను! కంద మూలాల కోసం అడవిలోకి వెళ్లిన సంగతి మరచిపోయాను... వెళ్లి చాలా సేపయింది.... ఇంకా తిరిగి రాలేదు... మరీ లోపలికి వెళ్లాడేమో. పాపం... లక్ష్మణుడు నా కోసం పడరాని పాట్లు పడుతున్నాడు. పగలంతా నా సేవలోనూ కందమూలాల సేకరణలోనూ గడుపుతాడు. రాత్రిళ్లు! కన్ను మూస్తే ఒట్టు! కంటికి రెప్పలా నన్ను కాపాడుతున్నాడు... తమ్ముడి ఋణాన్ని నేనెన్ని జన్మలెత్తినా తీర్చు

కోలేను. లక్ష్మణుడి వంటి తమ్ముడు ఎక్కడా ఉండడు – అనుకున్నాడు రాముడు.

బండమీది కోతుల కిచకిచలు మరీ ఎక్కువ కావడంతో ఏమిటా అని రాముడు ఆ వైపు చూశాడు. అవి భయంతో వణికి పోతున్నాయి.

ఆ బండ వైపుగా ఒక మదగజం పరుగెత్తుకుంటూ వస్తోంది. దారిలో అడ్డు వచ్చిన చెట్టు చేమల్ని తొండంతో నేలమట్టం చేస్తోంది. అలి నేల కూలిన చెట్లమీది పులుగులూ పిట్టలూ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని పరుగులు తీస్తున్నాయి. పరుగెత్తలేని వృద్ధవానరాలు కొన్ని ఏనుగు కాళ్లకింద పడి నలిగి పోతున్నాయి. ఆ విషాద దృశ్యం చూసే బండమీది కోతులు భయంతో వణికి పోతున్నాయి.

అంతవరకూ సంతోషంగా ఉన్న ఆ కోతులు అలా వణికి పోవడం చూసి రాముడు వాటిమీద జాలి చెందాడు. వెంటనే బాణం సంధించి విల్లు ఎక్కు పెట్టాడు. అంతే. మదగజం వెనక్కి తిరిగి పోయింది, మెల్లమెల్లగా.

బండమీది కోతులు రాముడి వంక కృతజ్ఞతా పూర్వకంగా చూశాయి. ఆ చూపు... రావణుడి అపహరణకు పాల్పడి భయవిహ్వల అయిన సీత జటాయువుని చూసిన చూపుగా కనిపించింది... ఋశ్యమూక పర్వతం మీద తిరుగుతున్న వానరాలను చూసి నగల మూటను కిందికి విసిరి వేసిన సీత చూపుగా గోచరించింది...

సీతా... ఆ నాడు నువ్వెంత బాధ పడ్డావో! నీ మనస్సు ఎంతగా పరితంపించిందో! అది తలచుకుంటేనే యిప్పుడూ నా మనస్సు వికలమై పోతోంది. ఆ రాక్షసుని బారినుంచి నిన్ను కాపాడాలని జటాయువు తన శక్తినంతా వినియోగించాడు... చివరికి ప్రాణ త్యాగం చేశాడు. రాక్షస శక్తే జయించింది... ఆ రాక్షస శక్తిని సర్వ నాశనం చేస్తాను. అంది నశిస్తేనే నాకు తృప్తి, లోకానికి శాంతి... సీతా! నీమీద ఒట్టు.

రాముడి మనస్సు సీతా స్మృతితో నిండిపోయింది. విశ్వామిత్రుడు, జనకుడు... స్ఫురణకు వచ్చారు. పాణిగ్రహణమహోత్సవానికి ముందు తాను

సీతను చూసిన ఆ చూపు, తర్వాత ఆమె తనను చూసిన ఆ చూపు, ఆ చూపుల్లోని అమృతాన్ని మించిన తీపి, ప్రేమను మించిన తీపి, తీపిని మించిన తీపి...

కందమూలాలు తీసుకువస్తున్న లక్ష్మణుడు దూరంనుంచి చూశాడు పర్ణశాలను. తలుపు తెరచి వుంది. రెండు కోతులు గుమ్మం దగ్గర కూర్చున్నాయి. చెంతనే ఉన్న ఒక చిన్న గుట్ట ఎక్కి నిశితంగా చూశాడు, ఆదుర్దాగా. రోజూ కూర్చునే అరుగుమీద రాముడు కనిపించలేదు. లక్ష్మణుడి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. నేను వచ్చేంతవరకూ అన్నయ్య ఎక్కడికీ వెళ్లడే! తలుపేమో తెరచి వుంది. గుమ్మం దగ్గర రెండు కోతులు. రామానుజుడి మనస్సులో రకరకాల భావాలు... మళ్లీ ఏ రాక్షసుడూ రాలేదుగదా, మారువేషంలో!

లక్ష్మణుడు బాణంలా దూసుకు వచ్చాడు. సరాసరి పర్ణశాల లోపలికి వెళ్లబోతుంటే, కోతులు కిచకిచమంటూ తిన్నెవద్దకు వెళ్లాయి.

అరుగుకి దగ్గరగా రాముడు నేలమీద పడివున్నాడు. కట్టుకున్న నారచీరకు మట్టి బాగా అంటుకుని వుంది. బుగ్గలు చారికలు కట్టాయి. వేళ్లు ఎర్రగా ఉన్నాయి. కొంచెం వాచాయి కూడా!

అరుగుమీద నుంచి రాముడు కింద పడ్డాడా? అవు నన్నట్టుగా కోతులు కిచకిచ మన్నాయి.

'అన్నయ్యా! అన్నయ్యా!' ఆదుర్దాగా పిలిచాడు తమ్ముడు.

రాముడు మెల్లగా కళ్లు విప్పాడు. తమ్ముణ్ణి ఆదరంగా విలోకించాడు.

'ఏమిటన్నయ్యా యిదంతా? అరుగు మీద నుంచి కింద పడ్డావా? చూడు వేళ్లు ఎలా వాచి ఎర్రగా ఉన్నాయో! ఎందుకన్నయ్యా! కంట తడిపెట్టావు? నేనుండగా నీకేమీ భయం లేదు. వదిన తప్పకుండా కనిపిస్తుంది. నా మాట నమ్ము...'

రాముడు తల పైకెత్తి తమ్ముడి కళ్లలోకి తొంగిచూశాడు.

'వదిన కనిపిస్తుందన్నయ్యా! నువ్వేమీ అధైర్య పడకు...' తమ్ముడు ధైర్యం చెబుతూవుండగానే రాముడి కళ్లు నీటి బుంగలయినాయి.

'అన్నయ్యా! నా మీద ఒట్టు. నువ్వు కంట తడిపెట్టకూడదు...' కళ్లు తుడిచాడు.

అన్నయ్యను అరుగుమీద కూర్చోబెట్టాడు.. తాను తెచ్చిన కందమూలాలను ముందుంచాడు. లోపలికి వెళ్లాడు.

ఇలాంటి తమ్ముణ్ణి పొందడం ఎవరికైనా కష్టమే... అని లక్ష్మణుడి భ్రాతృప్రేమను తలచుకుని రాముడు మురిసిపోతుంటే, లక్ష్మణుడు అమ్ములపొదితో వెలుపలికి వచ్చాడు - పర్ణశాలలోంచి. ముఖం కోపంతోకనకనలాడుతోంది.

శీఘ్రకోపి... అనుకున్నాడు రాముడు. అయినా తమ్ముడి కోపానికి కారణమేమిటో! అని ఆలోచిస్తూ తమ్ముడి వంక చూశాడు, నవ్వు మొగంతో.

అది గ్రహించకపోలేదు రామానుజుడు. అంతకోపమూ అంతలోనే మాయమై పోయింది. పరమ శాంతుడై యిలా అన్నాడు.

'చూడన్నయ్యా! సుగ్రీవుడు ఎంత కృతఘ్నుడో.... అతడి పబ్బం గడిచిపోయింది. నిమ్మకి నీరెత్తినట్లుగా కూర్చున్నాడు. వానా కాలం కాగానే కొండంత సహాయం చేస్తానన్నాడు. మళ్లీ యిటువైపు తొంగి చూడలేదు... కృతఘ్నుడు... కడుపునిండా తాగి కమ్మగా నిద్రపోతున్నాడేమో! వెళ్లి నిద్ర మత్తు కాస్తా వదిలించి వస్తాను... రామబాణ మహిమను ఒక్కసారి గుర్తు చేస్తాను...' ఉన్నట్టుండి ఆగిపోయాడు, మధ్యలో ఆవేశం తెచ్చుకున్న లక్ష్మణుడు.

రాముడు గుడ్డ చాటు చేసుకుని కంట తడిపెట్టాడు. 'తమ్ముడూ, సీత కనిపిస్తుందన్న ఆశ నాలో రోజు రోజుకీ ఎందుకో తగ్గిపోతోంది' అన్నాడు కళ్లనీళ్లు తుడుచుకుంటూ.

లక్ష్మణుడు ఏమీ మాట్లాడలేదు. కోపావేశంతో ముందుకి చరచర నడిచాడు. అరుగుమీద కూర్చున్న రాముడు చివాలున లేచి తమ్ముడు నడిచి వెడుతున్న వైపే చూడసాగాడు.

పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ లక్ష్మణుడు కిష్కింధ వైపు నడుస్తు న్నాడు. దారిలో రాళ్లూ రప్పలు కాళ్లకింద నుగ్గు నుగ్గు అవుతున్నాయి.

నడుస్తున్న వేగానికి అమ్ములపొది అటూ ఇటూ ఊగిపోతున్నది, పెనుగాలికి కదిలే ఆకులా. సుగ్రీవుణ్ణి ఏం చేస్తాడో యేమిటో అనుకుని భయ భ్రాంతుడయ్యాడు రాముడు.

అగ్నిపర్వతంలా రామానుజుడు వస్తున్నాడన్న వార్త అప్పటికప్పుడే కారుచిచ్చులా వ్యాపించింది కిష్కింధలో. భయకంపితులైన వానరవీరులు వెంటనే అంగదుణ్ణి సమీపించారు. అతనూ లక్ష్మణుడి రాకను గమనించాడు. ఆపద రానున్నట్టు గ్రహించి, క్షణాలమీద సుగ్రీవుడి వద్దకు బయలు దేరాడు.

మద్యపాన నిరతుడైన సుగ్రీవుడు శయ్యా గృహంలో ఉన్నాడు. అంగదుడు సరాసరి అక్కడికే వెళ్లాడు. ద్వార పాలకులు వారించినా లక్ష్మణుడి రాకను తెలియజేశాడు. అంత మద్యపానలోలుడూ లక్ష్మణుడి పేరు వినగానే హడిలిపోయి 'ఆ' 'ఆ' అన్నాడే కాని మరేమీ మాట్లాడలేక పోయాడు. ఇక లాభం లేదనుకుని అంగదుడు తన తల్లి తారవద్దకు బయలుదేరాడు. దారిలో హనుమంతుడు కలిశాడు. ఇద్దరూ తారవద్దకు దారి తీశాడు.

వానర వీరుల ప్రవర్తన ఆమెకు నచ్చలేదు. వానలు వెనక పట్టిన తర్వాత రామ కార్యంలో నిమగ్నులవుతామని సుగ్రీవుడు మాట యిచ్చినా, వారు ఆమాట నిలుపుకోకపోవడం ఆమెను బాధించింది. భార్యను కోల్పోయి రాముడు బాధపడుడు కాగా వానరవీరులు విలాసాలలో మునిగి తేలడం ఆమెను రంపపుకోత పెట్టింది. వానరులు కృతఘ్నులయ్యారనీ, రాముడి కోపానికి తమ జాతి పాల్పడడం మంచిది కాదనీ ఆమె భావించింది.

ఇంతలో అగ్ని పర్వతంలా ప్రతిభాసించే లక్ష్మణుడు అంతఃపురద్వారం సమీపించాడు. అది తెలుసుకున్న అంగదుడు ఏం చెయ్యాలో తోచక తల్లిని చూచాడు.

అప్పటికప్పుడే తార కొందరు స్త్రీలను వెంట బెట్టుకుని లక్ష్మణుడి వద్దకు బయలుదేరింది.

తన ముందు నుంచున్న స్త్రీ సమూహాన్ని చూసి అనవత వదనుడయ్యాడు రామానుజుడు, లజ్జతో, మౌనముద్రదాల్చాడు.

'రాములవారిని ఒంటరిగా విడిచిపెట్టి రామానుజులవారు ఎక్కడికీ కదలరని విన్నాను. అలాంటివారు యివాళ యిక్కడికి రావడంలోని ఆంతర్యమేమిటో... ఏమైనా మాకిది పర్వదినం! తమ రాకతో మారాజ్యం పావన మయింది...'

ఎవరిదీ మధుర మోహన కంఠం! వానరాంగనలకు కూడా ఇంత కంఠమాధుర్యం ఉంటుందా! ఆ మాటల్లో ఎంత ఆప్యాయత! ఎంత అభిమానం! ఆశ్చర్యంలో మునిగిపోయాడు లక్ష్మణుడు. అంతశ్రావ్యమైన కంఠస్వరం గల వానరస్త్రీని, రాముడి పట్ల ఆదరభావం ప్రదర్శించిన ఆ సుమతిని దర్శించాలనే తహతహ కలిగింది. అతను మెల్లమెల్లగా తలపైకెత్తాడు. బిడియ పడుతూ ఆమెను ఓరకంటితో చూచాడు.

ఆమె శ్వేతవస్త్రధారిణి! ముఖంలో సహజమైన లజ్జ. నుదుట కుంకుమ బొట్టు లేదు. మెడలో ఆభరణాలేవీ కనిపించలేదు. మాంగల్య చిహ్నాలూ కనిపించలేదు.

అయోధ్యలో నా తల్లులూ యిలాగే ఉన్నారు కాబోలు! లక్ష్మణుడు విచారగ్రస్తుడయ్యాడు. అతని మనస్సు మనస్సులో లేదు.

'మా మరిదిగారు మిమ్మల్ని త్వరలోనే కలుసుకుంటారు. మీకు తప్పకుండా సహాయం చేస్తారు. వానరులు కృతఘ్నులు కారు.'

ఆ తర్వాత తార అక్కడినుంచి నిష్క్రమించింది.

తార పాతివ్రత్యం, ఆమె కంఠమాధుర్యం, ఆమె మాటలతీరు... లక్ష్మణుడికి ఆమె పట్ల అపారమైన ఆదరభావం కలిగించాయి.

అగ్ని పర్వతంలాంటి లక్ష్మణమూర్తి మంచుకొండగా గోచరించాడు.

(కవి చక్రవర్తి బిరుదాంకితుడైన కంబమహాకవి తన తమిళ రామాయణంలో తారను పరమసాధ్విగా అభివర్ణించాడు. వాలి మరణానంతరం ఆమె విరక్త మనస్కగానే ఉండిపోయినట్లు ఆ కవిరాజు పేర్కొన్నాడు. ఆమె సౌశీల్యం ఆవేశపరుడైన రామానుజుణ్ణి సైతం శాంతచిత్తుణ్ణి చేయగలిగింది. ఆ మహాకవి చేసిన స్త్రీ పాత్ర చిత్రణం అనన్య సామాన్యం కంబకవి పేర్కొన్న యీ కథాంశం ఈ కథకు ఆధారం.)